క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



అలంపూర్: కర్నూల్‌లోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురిని ఆదివారం ఎమ్మెల్యే వీఎం అబ్రహం పరామర్శించారు. బీఆర్‌ఎస్ ఉండవెల్లి మండల అధ్యక్షుడు రమణ బంధువు, అయిజ మండలం ఉత్తనూరుకు చెందిన పరుశరాముడు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఆస్పత్రికి చేరుకొని వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాముడు ఉన్నారు.

గోశాలకు తరలిస్తాం

అయిజ: పట్టణంలోని రోడ్లపై తిరుగుతున్న ఆవులను గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రధాన రోడ్లపై తిరుగుతున్న ఆవులతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా హరితహారంలో నాటిన మొక్కలను తింటున్నాయని తెలిపారు. యజమానులు తమ పశువులను కట్టేసుకోవాలని కోరారు. ఇకపై రోడ్లపై కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు



అయిజ: మండలంలోని ఉత్తనూరు గ్రామశివారులో విద్యుత్‌లైన్ ప్రమాదకరంగా మారాయి. భూంపురం వెళ్లే మార్గంలో ఉత్తనూరుకు చెందిన రైతు గోపాల్ వ్యవసాయ పొలంలో ఉన్న 33కేవీ విద్యుత్ లైన్‌తో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 8నెలల కిందట విద్యుత్ స్తంభాలు ఒకవైపు ఒరిగినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు తెలిపారు. ప్రమాదం చోటుచేసుకోకముందే విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

దైవచింతనతో మెలగాలి



ధరూరు: ప్రతి ఒక్కరూ దైవచింతనతో మెలగాలని రెవ పాస్టర్ నరేష్‌పాల్ అన్నారు. సెప్టెంబర్ మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైబిల్ ప్రవచనాలను బోధించారు. ఏసుక్రీస్తును పోలిన జీవితాన్ని కలిగి ఉండాలని తెలిపారు. సమాజంలో యువత అనేక రుగ్మతలకు లోనవుతోందని, యువకులు సన్మార్గంలో పయనించాలని కోరారు. సంఘం సమాజానికి కట్టుబడి జీవించాలని సూచించారు. అనంతరం ప్రార్థనాపూర్వకంగా బల్లారాధన కార్యక్రమం నిర్వహించి, ప్రభు సంస్కార (సహపంక్తి) భోజనం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సీమోను, సత్యన్న, డేవిడ్, దానియేలు, యోబు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు అవార్డు



రమేష్‌లింగం

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌లింగం ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 409 కళాశాలలకుగానూ గద్వాల జిల్లా నుంచి మల్దకల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రమేష్‌లింగంకు అవార్డు రావడంపై అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, శివకుమార్, గోవర్ధన్, భాగ్యలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: మండల కేంద్రంలోని ఆదిశిలా క్షేత్రంలో ఆదివారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు, పార్టీ నాయకులు ఆమెకు స్వాగతం పలికారు. స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు. రామచంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రాముడు, వెంకటేశ్వర్‌రెడ్డి, దామ నాగరాజు, వెంకటేష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నత్తనడకన 'నెట్టెంపాడు'

- అసంపూర్తిగా రిజర్వాయర్లు, కాల్వల నిర్మాణం
- పంట పొలాలకు సాగునీరందక రైతుల అవస్థలు
- ఆయిల్ ఇంజిన్ల సాయంతో నీటి తరలింపు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడి
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ఎడ్లబండిపై పైపులు, ఆయిల్ ఇంజిన్‌ను పంటపొలానికి తీసుకెళ్తున్న రైతు



కాల్వ నుంచి పంట పొలాలకు నీటిని పంపింగ్ చేస్తున్న ఆయిల్ ఇంజిన్

అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్టు నుంచి నడిగడ్డ రైతులకు సాగునీరందిస్తామని నాయకులు ఇస్తున్న హామీలు నీటిమూటలుగా మారుతున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా నెట్టెంపాడు పథకం నత్తనడకన సాగుతూనే ఉంది. దీంతో రిజర్వాయర్లలోని నీరు పంట భూములకు చేరడంలేదు. నెట్టెంపాడు ప్రాజెక్ట్ నుంచి వివిధ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి 15ఏళ్లు అవుతోంది. నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా అయిజ మండలంలోని పంటభూములకు సాగునీరు అందించేందుకు పనులు చేపట్టారు. లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం పూర్తయినా రిజర్వాయర్లు, కాల్వ నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రతి ఏడాది వర్షాభావ పరిస్థితులతో పంటలు పండకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు..

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో రైతులు అల్లాడుతున్నారు. వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలో బోరుబావుల కింద 428 ఎకరాల్లో వరిసాగు చేశారు. అదేవిధంగా సజ్జలు 85 ఎకరాలు, మొక్కజొన్న 594, కొర్రలు 84, కందులు 1040, మిరప 2,220, చెరుకు 20, ఉల్లి 420, పత్తి 15,020, వేరుశనగ 2,100, పొద్దుతిరుగుడు 13, ఆముదం 545 ఎకరాల్లో సాగుచేసారు. యాసంగిలో పప్పుశనుగ, వాము, జొన్న తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

ఆయిల్ ఇంజిన్ల సాయంతో..

ఆగస్టు నెల మొత్తం వర్షాలు పడకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కళ్లముందే నెట్టెంపాడు కాల్వ పారుతున్నా అసంపూర్తి పనులతో పంటచేలను తడుపుకోలేని దుస్థితి ఏర్పడింది. అసంపూర్తిగా ఉన్న కాల్వల నుంచి ఆయిల్ ఇంజిన్ల ద్వారా మిరప, పత్తి, కంది పంటలకు సాగునీరందిస్తున్నారు. ఇందుకోసం ఎకరాకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చవుతోంది. కొంతమంది రైతులు వాగులలో పారుతున్న నీటికి ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పంట పొలాలకు పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వచ్చే ఏడాది వానాకాలం నాటికైనా కాల్వల ద్వారా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..



నెట్టెంపాడు నుంచి పంటపొలాలకు నీళ్లు వస్తాయని సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్నాం. పంట పొలాల్లో కాల్వలు తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నా లాభం లేకుండా పోయింది. కాల్వలు తవ్వకపోయినా ఆ స్థలంలో పంటలు పండించుకునేవాళ్లం.

– మాధనన్న, రైతు, అయిజ

నీళ్లు వచ్చేటట్లు చూడండి..



వర్షాలు లేక ప్రతి సంవత్సరం పంటలు ఎండిపోతున్నాయి. వాగుకు చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతులు మోటార్లు పెట్టి పంట పొలాలకు నీళ్లు కడుతున్నారు. పైపులు పగిలిపోతున్నాయి. డీజిల్ ఖర్చు ఎక్కువ అవుతోంది. పరిస్థితి ఘోరంగా ఉంది. వచ్చే వానాకాలం నాటికైనా కాల్వ పనులు పూర్తిచేసి నీళ్లు వదలాలి.

– తిరుమల్లేష్, రైతు, అయిజ

రూ.10వేల వరకు ఖర్చు..



నెట్టెంపాడు కాల్వ పనులు పూర్తికాలేదు. అక్కడక్కడ తవ్వి వదిలేశారు. పంట పొలాలకు సాగునీరు అందించుకునేందుకు పైపులు, ఇంజిన్లను కొనుకున్నాం. నీటి తడికోసం ఎకరాకు రూ.10వేల వరకు ఖర్చు పెడుతున్నాం. అసంపూర్తిగా ఉన్న కాల్వల నుంచి డీజిల్ ఇంజిన్లతో పంటపొలాలకు సాగునీరందిస్తున్నాం.

– సత్యారెడ్డి, రైతు, అయిజ

కాల్వలు ఇలా.. నీళ్లు పారేదెలా?



కంపచెట్లతో మూసుకుపోయిన డీ-27 కాల్వ

శాంతినగర్: ఆర్డీఎస్ డిస్ట్రిబ్యూటరీ కాల్వలు అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు, కంపచెట్లు, చెత్తాచెదారంతో మూసుకుపోయాయి. ఇప్పటికే నీళ్లు వదలాల్సి ఉండగా, ఎగువన ఉన్న టీబీ డ్యాంలో నీటి నిల్వలు లేక కెనాల్ వట్టిపోయింది. తుఫాన్ల ప్రభావంతో టీబీ డ్యాం నుంచి కెనాల్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం డిస్ట్రిబ్యూటరీ కాల్వలు అధ్వానంగా ఉండడంతో నీళ్లు వదిలితే సాఫీగా ముందుకు సాగే పరిస్థితి లేదు. ఆర్డీఎస్ ప్రధాన కాల్వలోని షిల్ట్‌ను ఇటీవల తొలగించారు. డిస్ట్రిబ్యూటరీ కాల్వలను పట్టించుకోవడంలేదు. దీంతో ప్రధాన కాల్వ నుంచి నీటిని వదిలినా డిస్ట్రిబ్యూటరీలు, సబ్ డిస్ట్రిబ్యూటరీ కాల్వల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్డీఎస్ అధికారులు స్పందించి డిస్ట్రిబ్యూటరీ కాల్వలను శుభ్రం చేయించి నీటి పారుదలకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

వర్షం.. హర్షం



ఉండవెల్లి: మండలవ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున మోస్తారు వర్షం కురిసింది. పంటలు ఎండుతున్న క్రమంలో వర్షం కురువడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షంతో మిరప, పత్తి, మొక్కజొన్న, కంది పంటలు పచ్చదనం సంతరించుకున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పలువురు రైతులు పొగాకు సాగుకు సిద్ధమయ్యారు.

ధరూరు: మండలంలో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతోపాటు మన్నాపురం, జాంపల్లి తదితర గ్రామాల్లో ఉదయం 6నుంచి 7గంటల వరకు కురిసిన వర్షం పంటలకు ఊరటనిచ్చింది. ఎండుముఖం పట్టిన మెట్ట పంటలకు జీవం పోసినట్లయింది.

ఎమ్మిగనూరుకు బస్సు సౌకర్యం

అయిజ: గద్వాల ఆర్టీసీ డిపో నుంచి నాగలదిన్నె బ్రిడ్జి మీదుగా ఎమ్మిగనూరుకు బస్సు సౌకర్యం కల్పించినట్లు డీఎం మంజులారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి అయిజ, తుపత్రాల, మేడికొండ, పులికల్, రాజాపురం, నాగలదిన్నె, పులిచింతల క్రాస్‌రోడ్, నందవరం, ముగతి మీదుగా ఎమ్మిగనూరుకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రోజు నాలుగు మార్లు బస్సు తిరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

గద్వాల వ్యవసాయం: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి శంకరయ్య కోరారు. పట్టణంలోని రెండో రైల్వేగేట్, హమాలీకాలనీల్లో ఆదివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతోపాటు నటల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

మహా భాగవత సప్తాహం ప్రారంభం

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహా భాగవత సప్తాహం ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. మహా భాగవత సప్తాహంలో భాగంగా ఈనెల 9వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వారి మంగళ శాసనములతో చేపట్టినట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నియంత పాలనకు చరమగీతం పాడుదాం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్: నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను ఫణంగా పెట్టి కేసీఆర్ సాగిన నియంత పాలనకు చరమగీతం పాడుదామని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లను బాగు చేయరా?



గట్టులో బురదమయంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న రంజిత్‌కుమార్

గట్టు: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే రోడ్లు మొత్తం బురదమయంగా మారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలో రోడ్లపై నడవలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు బలరాం, జిల్లా కార్యదర్శి లవన్న, విష్ణు, తిమ్మప్ప, అమరేష్, లక్ష్మన్న, పరుశరాముడు, గోపాల్, నేతన్న, చిన్నరాముడు, భూపతి, గోపాల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు–చిన్నపోతులపాడు రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించలేక నరకయాతన పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు మొత్తం బురదమయంగా మారుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పాముల భయం



పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని ముంపుగ్రామం నాగరాలలో రాత్రి సమయంలో పాములతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రిజర్వాయర్ ఏర్పాటుతో గ్రామాన్ని తరలించగా ఇంకా 58 కుటుంబాలు అక్కడే నివసిస్తున్నాయి. రంగసముద్రం జలాశయంలోకి నీళ్లు వదులు తుండడంతో నీటిలోంచి విషసర్పాలు గ్రామంలోకి వస్తున్నాయి. పాముల వల్ల రాత్రి వేళల్లో బయటికి రావాలంటేనే భయపడుతున్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: అన్ని అర్హతలు ఉన్న అయిజ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయిజ పట్టణం ఐదు మండలాలకు అతి సమీపంలో ఉందన్నారు. 20 కి.మీ.పరిధిలో సుమారు 60 గ్రామాలు ఉన్నాయని, ప్రజలు వివిధ పనుల నిమిత్తం రోజు పట్టణానికి వస్తుంటారని తెలిపారు. పట్టణానికి సమీపంలో రెండు జాతీయ రహదారులను ఏర్పాటు చేస్తున్నారని, వచ్చే పదేళ్లలో 10 రెవెన్యూ గ్రామాలు పట్టణంలో కలిసే అవకాశం ఉందన్నారు. పట్టణ విస్తీర్ణం, జనాభా విషయంలో గద్వాల మెదటి స్థానంలో ఉంటే, అయిజ రెండోస్థానంలో ఉందని తెలిపారు. మెదక్ జిల్లాలో 1.50 లక్షల జనాభా కలిగిన రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారని, అయిజ పట్టణాన్ని రెండు, మూడు గ్రామాలతో కలిపి రెవెన్యూ డివిజన్‌గా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ తిరుమల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నర్సింహయ్యశెట్టి, ప్రధాన కార్యదర్శులు ప్రదీప్ కుమార్, భగత్‌రెడ్డి ఉన్నారు.

దివ్యాంగుల భరోసా సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరావు

అయిజ: పట్టణంలోని పాత ఠాగూర్ పాఠశాల ఆవరణలో ఈనెల 6న నిర్వహించనున్న బహుజన దివ్యాంగుల భరోసా సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలను తెలుసుకోవడానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపాల్, ప్రేమ్‌కుమార్, మాలిక్‌బాషా, చిన్నా, హనుమన్న, తిమ్మప్ప ఉన్నారు.

బీఎస్పీ జెండా పండుగ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో ఆదివారం బీఎస్పీ జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ప్రభుదాసు, శోభన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, నాగేంద్ర, శివ, మారెన్న, రవి, మహేష్, నంద, శరత్, విజయ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన వాల్మీకులు



హైదరాబాద్‌కు బయలుదేరుతున్న వాల్మీకి సంఘం నాయకులు

గద్వాల రూరల్: నియోజకవర్గంలో వాల్మీకులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంతోపాటు ఆయా మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వాల్మీకులు హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అదేవిధంగా గట్టు భీముడికి ఎమ్మెల్సీ ఇస్తామన్న మాటను నిలబెట్టుకోలేదని, బీఆర్‌ఎస్‌ను నమ్మె స్థితిలో లేమన్నారు. కాంగ్రెస్ పార్టీ తమపై నమ్మకంతో వాల్మీకులకు టికెట్ కేటాయించాలని, గతంలో గట్టు భీముడిని గెలిపించుకున్నట్లు ఈ సారి కూడా గెలిపించుకుంటామని తెలిపారు. ఈ విషయంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను కలవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌బాబు, రాములు, వీరబాబులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉండవెల్లి: అధిక ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి కుదింపుపై ఆదివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించడం సరికాదన్నారు. పేదలకు గుదిబండగా మారిన అధిక ధరలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో గడ్డం వెంకటేశ్వర్లు, పాండు, బాల్‌రాజు, ఈరన్న, అంజి, వెంకటస్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ముమ్మరం



ఉండవెల్లిలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రకళ

ఉండవెల్లి: ఓటరు నమోదు ప్రక్రియను ముమ్మరం చేసినట్లు ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, సవరణ తదితర వాటికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు తప్పులు లేకుండా జాబితాను రూపొందించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జయంతి, ఆర్‌ఐ రాజేష్, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



మానవపాడులో..

మానవపాడు: మండలంలోని గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఫాం–8కు సంబంధించి 39, ఫాం–6కు 93 దరఖాస్తులు వచ్చాయని బీఎల్‌ఓలు తెలిపారు.

రైతు సమస్యలు తీర్చడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అమరచింత: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని ఎస్‌కేఎం జిల్లా నాయకులు వెంకటేష్, రాబర్ట్, రాజన్నలు అన్నారు. జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో రైతు సమస్యలపై సోమవారం నిర్వహించే జిల్లా సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా రైతు సదస్సుకు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోరుతూ దేశ వ్యాప్తంగా 570 సంఘాలతో ఎస్‌కేఎం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీన్ని రాష్ట్ర, జిల్లాస్థాయిలలో వ్యాప్తి చేయడానికి వీలుగా రైతు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో అజయ్ ప్రసాద్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న తుఫాన్



తుఫాన్ ఢీకొట్టడంతో ధ్వంసమైన డివైడర్

అమరచింత: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రహదారిపై డివైడర్‌ను తుఫాన్ ఢీకొట్టిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని మల్దకల్ నుంచి నారాయణపేట జిల్లా కోటకొండకు తుఫాన్‌లో శుభకార్యానికి వెళ్తున్నారు. అమరచింత పెట్రోల్ బంక్ సమీపంలో డివైడర్‌ను తుఫాన్ ఢీ కొట్టడంతో వాహనం ముందు చక్రంతో పాటు అద్దాలు ధ్వంసమయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి వారిని రక్షించారు. వాహనంలో ప్రయాణిస్తున్న వారితో పాటు డ్రైవర్ సైతం మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.